ముగిసిన వార్డు సభలు

- అభ్యంతరాలపై నేడు పరిశీలన
- పేర్లులేని వారి నుండి దరఖాస్తుల స్వీకరణ
- ఈ నెల 26 తర్వాత అందనున్న మంజూరు ఉత్తర్వులు



43వ డివిజన్ వార్డు సభలో లబ్ధిదారుల పేర్లు చదివి వినిపిస్తున్న ప్రత్యేక అధికారి

ఖమ్మంమయూరిసెంటర్: అర్హులైన లబ్ధిదారులకు నాలుగు పథకాలు అందించేందుకు నిర్వహించిన ప్రజాపాలన వార్డు సభలు గురువారంతో ముగిసాయి. 60 డివిజన్ల పరిధిలో రేషన్‌కార్డు, ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి జాబితాను అధికారులు వార్డు సభల్లో బహిర్గతం చేశారు. జాబితాలో పేర్లు చదివి వినిపించిన అధికారులు వాటిపై స్థానికుల నుండి అభ్యంతరాలు స్వీకరించారు. మూడు రోజుల పాటు ఖమ్మం నగరంలో నిర్వహించిన వార్డు సభలను ఒకటి రెండు డివిజన్లలో చిన్నచిన్న నిరసనలు మినహా అంతటా ప్రశాంతంగా ముగించారు.

ఇళ్ల కోసం 53,990 దరఖాస్తులు..

నగరంలో ఇందిరమ్మ ఇళ్ల కోసం 53,990 మంది దరఖాస్తులు చేసుకున్నారు. వీటిపై సర్వే చేసిన అధికారులు ఇంటి స్థలం లేకుండా ఇందిరమ్మ ఇళ్ల కోసం 31,490 మంది, ఖమ్మంలో ఇంటి స్థలం ఉండి 5,752 మంది అర్హులుగా గుర్తించారు. వీరి పేర్లను వార్డు సభల్లో అధికారులు బహిరంగంగా చదివి వినిపించారు.

రేషన్‌కార్డుకు 5,295 కుటుంబాలు..

నగరంలో 5,295 కుటుంబాలు రేషన్‌కార్డుకు దరఖాస్తు చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. రేషన్ కార్డులు పొందేందుకు అర్హత పొందిన వారి పేర్లను అధికారులు వార్డు సభల్లో వెల్లడించారు. సభల్లో అభ్యంతరాలు వ్యక్తమైన కుటుంబాల వివరాలను మరోసారి పరిశీలించనున్నారు.

అభ్యంతరాలపై నేటి నుండి పరిశీలన..

వార్డు సభల్లో అర్హుల జాబితాపై వచ్చిన అభ్యంతరాలను అధికారులు శుక్రవారం నుంచి వివరాలు పరిశీలించి, అనర్హులు ఉంటే వారి పేర్లను జాబితా నుండి తొలగించనున్నారు. పలు డివిజన్లలో ఐటీ చెల్లించే వారి పేర్లు కూడా అర్హుల జాబితాలో వచ్చాయని అధికారుల ఎదుట స్థానికులు వెల్లడించినట్లు తెలుస్తోంది. వీటిపై నిశితంగా పరిశీలించిన తర్వాత తుది జాబితాను కేఎంసీ అధికారులు కలెక్టర్‌కు పంపించనున్నారు. అనంతరం 26 తర్వాత అర్హులైన లబ్ధిదారులకు పథకాలకు సంబంధించిన మంజూరు పత్రాలు ఇవ్వనున్నారు.

మళ్లీ దరఖాస్తులు..

ప్రభుత్వం ప్రకటించిన పథకాలకు సంబంధించి జాబితాల్లో పేర్లు రాని వారి నుండి అధికారులు మళ్లీ దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. వార్డు సభలు జరిగే ప్రాంతంలోనే అధికారులు హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసి దరఖాస్తులను స్వీకరించారు. అక్కడ అధికారులకు దరఖాస్తులు ఇవ్వలేకపోయిన వారు కేఎంసీ కార్యాలయంలో ఇవ్వవచ్చని వెల్లడించారు. స్వీకరించిన దరఖాస్తులను ఆన్‌లైన్ చేసి, మరోసారి సర్వే చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు.

కేఎంసీకి బారులు..



ప్రజాపాలన సభల్లో ప్రభుత్వ పథకాలకు సంబంధించి అర్హుల జాబితాల్లో పేర్లు రాని నగర వాసులు కేఎంసీ కార్యాలయంకు క్యూ కడుతున్నారు. రేషన్‌కార్డు, ఇందిరమ్మ ఇళ్ల కోసం దరకాస్తు చేసుకునేందుకు గురువారం కేఎంసీలో బారులు తీరారు. ఇక శుక్రవారం దరఖాస్తు చేసుకునేందుకు కేఎంసీకి భారీగా దరఖాస్తుదారులు వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. దరఖాస్తుదారులతో కేఎంసీ కార్యాలయం కోలాహలంగా మారింది.

అదే.. ఉద్రిక్తత..

- నిరసనల నడుమ ముగిసిన గ్రామసభలు

నాలుగు పథకాల లబ్ధిదారుల కోసం రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన గ్రామసభలు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా పలు చోట్ల ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి.

కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల తోపులాట



మంగళగూడెంలో ఘర్షణ పడుతున్న నాయకులు

● **ఖమ్మంరూరల్:** మండలంలోని మంగళగూడెంలో జాబితాలో ఎక్కువ మంది అనర్హులే ఉన్నారని, ఇందిరమ్మ కమిటీల పేరుతో సొంత పార్టీ వారిని అర్హులు కాకున్నా ఎంపిక చేశారని ప్రజలు నిరసన వ్యక్తం చేశారు. ఈ మేరకు కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు ఘర్షణ పడి ఒకరిపై ఒకరు కుర్చీలు విసిరేసుకున్నారు. మండలంలోని ముత్తగూడెం, తల్లంపాడు, తెల్దారుపల్లి, గూడురుపాడుల్లో ప్రజలు అధికారులను నిలదీశారు. తల్లంపాడులో గ్రామసభ సభలోనే నిరసన తెలిపారు.



వీవీపాలెంలో..

● **రఘునాథపాలెం:** మండలంలోని వీవీపాలెం, బూడిదంపాడు, పాపటపల్లి, హరియాతండా, కోటపాడు, మల్లేపల్లి, రజబ్‌ఆలీనగర్, వేపకుంట్ల తదితర పంచాయతీల్లో గ్రామ సభలు జరిగాయి. ఒక వైపు అర్హులమైన తమ పేర్లు రాలేదని లబ్ధిదారులు, వారికి తోడుగా బీఆర్ఎస్ శ్రేణులు ఆందోళనలకు దిగడంతో గ్రామసభలు గందరగోళంగా మారాయి.

మహిళ ఆందోళన..



అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు

● **నేలకొండపల్లి:** మండలంలోని నేలకొండపల్లి, ముజ్జుగూడెం, మండ్రాజుపల్లి, పైనంపల్లి, సుర్దేపల్లి గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. సుర్దేపల్లిలో వడ్లమూడి ముత్యాలు తనకు అర్హత ఉన్నప్పటికీ ఇల్లు రాలేదని పెట్రోల్ డబ్బాతో తనకు న్యాయం చేయాలని ఆందోళన చేసింది. స్థానికులు, అధికారులు ఆమెకు సర్దిచెప్పారు. నేలకొండపల్లి సభలో అర్హత లేని వారికి ఇచ్చారని సీపీఐ మండల కార్యదర్శి కర్నాటి భానుప్రసాద్, మారిశెట్టి వెంకటేశ్వరరావు, మాదాసు ఆదాం అధికారులను నిలదీశారు. పైనంపల్లిలో లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరగాలని డీసీఎంఎస్ డైరెక్టర్ నాగుబండి శ్రీనివాసరావు స్పెషల్ ఆఫీసర్‌కు వినతిపత్రం అందజేశారు.



కేశ్వాపురంలో..

● **కూసుమంచి:** మండలంలోని ఈశ్వరమాధారం, గంగబండతండా, జక్కేపల్లి, కేశ్వాపురం, కిష్టాపురం, హీరామాన్ తండా, బోడియాతండా, ధర్మాతండా, జుజుల్‌రావుపేట, కోక్యాతండా, రాజుపేట బజార్ గ్రామాల్లో సభలను నిర్వహించగా కేశ్వాపురంలో గ్రామస్తులు తమ పేర్లు జాబితాలో చేర్చలేదంటూ అధికారులను ప్రశ్నించారు.



పింజరమడుగులో..

● **కామేపల్లి:** సంక్షేమ పథకాల అర్హుల ఎంపిక నిరంతరం ప్రక్రియ అని తహసీల్దార్ సుధాకర్ అన్నారు. మండలంలోని గరిడేపల్లి, నెమలిపురి, సాతానిగూడెం,లాల్యతండా, పింజరమడుగు గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు.



లక్ష్మీదేవిపల్లిలో..

● **తిరుమలాయపాలెం:** మండలంలోని దమ్మాయిగూడెం, చంద్రుతండా తదితర గ్రామాలలో అధికారులను నిలదీశారు. దీంతో అర్హులైన వారు దరఖాస్తు చేసుకుంటే పరిశీలిస్తామని అధికారులు హామి ఇవ్వడంతో ప్రజలు దరఖాస్తు చేసుకున్నారు.

అర్హులు దరఖాస్తులు అందించాలి..



కామంచికల్‌లో..

● **ఖమ్మంఅర్బన్:** ప్రభుత్వం అందించబోతున్న నాలుగు పథకాల్లోని జాబితాల్లో అర్హులు పేర్లు లేకపోతే దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీడీఓ అశోక్‌కుమార్ అన్నారు. మండలంలోని కామంచికల్‌లో జరిగిన గ్రామసభలో పాల్గొని మాట్లాడారు. పంచాయతీ కార్యదర్శి రమణి ,స్పెషల్ ఆఫీసర్ ఇందిర జ్యోతి, కమిటీ సభ్యులు ప్రతాపనేని గాంధీ, లింగయ్య, గాంధీ, సాంబశివరావు, గుండు అనిత, ఆత్మ కమిటీ డైరెక్టర్ మక్కా మల్లయ్య, వేములపల్లి రాధాకృష్ణ , ప్రతాపనేని రఘు తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

జాతీయ స్థాయి పరీక్షల్లో ప్రతిభ



ప్రతిభ చూపిన విద్యార్థులతో యాజమాన్యం

ఖమ్మంసహకారనగర్: జాతీయ స్థాయిలో నిర్వహించిన నాలెడ్జ్ అసెస్‌మెంట్ టెస్ట్(క్యాట్)లో ఖమ్మం మమత రోడ్డులోని శ్రీ చైతన్య ఇంటర్నేషనల్ ఒలింపియాడ్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారని విద్యాసంస్థల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య తెలిపారు. ఈ సందర్భంగా గురువారం వారు విద్యార్థులను అభినందించి మాట్లాడుతూ పోటీ పరీక్ష లెవల్-2లో 373 మంది అర్హత సాధించగా.. అందులో 38 మంది నగదు పురస్కారం, 108 మంది ప్రత్యేక బహుమతులు అందుకున్నారని తెలిపారు. డీజీఎం చేతన్ మాధూర్, కోఆర్డినేటర్ కృష్ణారావు, ప్రిన్సిపాల్ టీఎల్ఎన్ శర్మతో పాటు రామకృష్ణారెడ్డి, రాజశేఖరరెడ్డి, కేవీఆర్ పాల్గొన్నారు.

నియామకం

ఖమ్మం మామిళ్లగూడెం: జాతీయ మానవ హక్కుల కమిటీ జిల్లా చైర్మన్‌గా ఖమ్మం ప్రకాశ్ నగర్‌కు చెందిన పత్తికొండ శ్రీనివాసులు నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు బద్దిపడగ శ్రీనివాస్‌రెడ్డి గురువారం నియామక పత్రం జారీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. అలాగే, అర్హులకు పథకాలు అందేలా చూస్తానని వెల్లడించారు.

రేపు కేఎంసీలో రెవెన్యూ మేళా

ఖమ్మంమయూరిసెంటర్: కేఎంసీ పరిధిలో రెవెన్యూ విభాగ సమస్యల పరిష్కారానికి శనివారం రెవెన్యూ మేళా నిర్వహిస్తున్నట్లు కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళాలో రెవెన్యూ తప్పుల సవరణ, ఇంటి నంబర్ సవరణ, ఇంటి పన్ను నమోదులో తప్పులు, ఇంటి పన్ను ఎక్కువగా వస్తే వాటిని పరిశీలించి సవరణ చేయడం జరుగుతుందని, రెవెన్యూ మేళాలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి వారం రోజుల్లో సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. నగర ప్రజలు ఈ మేళాను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రౌండ్‌టేబుల్ సమావేశాన్ని విజయవంతం చేయాలి

ఖమ్మం మామిళ్లగూడెం: ఎస్సీ వర్గీకరణ వాస్తవాలు మాలలపై అసత్య ప్రచారం తదితర అంశాలపై శనివారం ఉదయం 11 గంటలకు ఖమ్మం అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించే రౌండ్ టేబుల్ సమావేశాన్ని జయప్రదం చేయాలని మాలమహానాడు ఉమ్మడి ఖమ్మం జిల్లా కన్వీనర్ గుంతేటి వీరభద్రం కోరారు. గురువారం ఖమ్మం జెడ్పీ సెంటర్లోని సంఘ కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడారు. గౌరవ సలహాదారులు లింగాల రవికుమార్, ఐఎంఎల్‌పీ ప్రధాన కార్యదర్శి ప్రకాష్, నరసింహారావు, సుధాకర్, శ్రీనివాస్, రమేష్, పేతురు, పభాకర్ ఉన్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

నేలకొండపల్లి: మండలంలోని రాజేశ్వరపురానికి చెందిన నాని(20) గురువారం ఇంట్లో ఉరి సుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. సకాలంలో గమనించిన కుటుంబ సభ్యులు ఆయనను నేలకొండపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా, ఆయన ఆత్మహత్యాయత్నానికి కారణాలు తెలియరాలేదు.

ముగ్గురిపై కేసు

కామేపల్లి: మండలంలోని బర్లగూడెంకు చెందిన లునావత్ నీలా భూమిలోకి అదే గ్రామానికి చెందిన లునావత్ చిన్నానాయక్, భారతి, విహారిక ప్రవేశించి బావి పైపులు, కరెంట్ స్టార్టర్ పెట్టెను ధ్వంసం చేశారు. ఘటనపై బాధిత రైతు ఫిర్యాదుతో గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు.

అక్రమ నిర్మాణం తొలగింపు

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని 30వ డివిజన్‌లో గోళ్లపాడు చానల్‌పై అక్రమంగా నిర్మిస్తున్న కాంపౌండ్ వాల్‌ను కేఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు తొలగించారు. గోళ్లపాడు చానల్‌పై అక్రమ నిర్మాణాలు చేపడితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

27న మధ్యాహ్న భోజనం బంద్

కూసుమంచి: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈనెల 27న చలో కలెక్టరేట్ కార్యక్రమానికి తరలివెళ్తుండగా ఆరోజు భోజనం వండమంటూ భోజన వర్కర్స్ మండల కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కోటమ్మ, కృష్ణకుమారి తెలిపారు. ఈ మేరకు గురువారం ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి గుండెపొంగు మల్లేష్‌తో కలిసి ఎంఈఓ రాయల వీర స్వామికి ముందస్తుగా వినతిపత్రం అందజేశారు.

రాష్ట్రాన్ని ముందుంచడానికి సహకరించాలి



ఖమ్మంవన్‌టౌన్: మంత్రి పొంగులేటికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న టీఎన్జీవోస్ కమిటీ

ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్ర శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని టీఎన్జీవోస్ జిల్లా కమిటీ సభ్యులు గురువారం మర్యాదపూర్వకంగా కలవగా వారిని మంత్రి అభినందించారు. స్నేహపూర్వక వాతావరణంలో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుంచడానికి ఉద్యోగుల సహకారం అందించాలన్నారు. జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు గుంటుపల్లి శ్రీనివాసరావు, కొణిదెన శ్రీనివాస్, ట్రెజరర్ వల్లపు వెంకన్న, సహాధ్యక్షులు దుర్గాప్రసాద్, జైపాల్, విజయ్‌కుమార్, బాలకృష్ణ, యర్రా రమేష్, కరణ్‌సింగ్, లలితకుమారి, శ్రీకాంత్, కోనార్, హరికృష్ణ, యాకూబ్‌పాషా, రాధాకృష్ణ, శ్రీనివాస్, రాధిక, రమణాయాదవ్, శంకర్, రవి, ముఖీత్, మన్మథరావు, పవన్, ప్రవీణ్, సైదులు, లింగమూర్తి, వీరయ్య, రుక్మారావు, రాజ్‌కుమార్, మన్మథరావు, భరత్‌రెడ్డి తదితరులున్నారు. అదే విధంగా ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డిని టీఎన్జీవోస్ కమిటీ కలిసింది.

క్యాలెండర్లు ఆవిష్కరణ..

తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం క్యాలెండర్‌ను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆవిష్కరించారు. జిల్లా కార్యదర్శి మోదుగు వేలాద్రి, వాసిరెడ్డి శ్రీనివాస్, కొండపల్లి శేషుప్రసాద్, పి విజయ్‌కుమార్, ఉషశ్రీ, రామకిషోర్‌రెడ్డి, సతీష్, సుధారాణి, మంజుల, జహీరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్వోసీ అందజేత..

కూసుమంచి: మండలంలోని నర్సింహులగూడెం గ్రామానికి చెందిన ఉప్పమ్మకు చికిత్స నిమిత్తం మంజూరైన రూ.2లక్షల ఎల్వోసీని మంత్రి పొంగులేటి బాధితురాలికి అందజేశారు.

నివాళి..

ఖమ్మంఅర్బన్: ఇటీవల మృతి చెందిన చిత్తారు హుస్సేన్ సంతాప సభ నగరంలోని వరదయ్యనగర్‌లో నిర్వహించగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొని హుస్సేన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుమారులు సింహాద్రీ, విశ్వనాథులను పరామర్శించారు. అఖిల భారత యాదవ మహాసభ జిల్లా గౌరవ అధ్యక్షులు, మేకల మల్లిబాబు యాదవ్, జిల్లా అధ్యక్షులు చిలకల వెంకటనరసయ్య, రాష్ట్ర నీటిపారుదల శాఖ సంస్థ చైర్మన్ మువ్వ విజయబాబు, డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, మద్దినేని స్వర్ణకుమారి, ఖమ్మం మార్కెట్ చైర్మన్ యరగర్ల హనుమంతరావు, కార్పొరేటర్లు మలీదు వెంకటేశ్వర్లు ,కూరాకుల వలరాజు, నాగేశ్వరరావు, షేక్ పతే మహమ్మద్, కూరాకుల నాగభూషణం, నాగరాజు, జిల్లా ఓబీసీ అధ్యక్షులు పుచ్చకాయల వీరభద్రం వెంకన్న తదితరులు ఉన్నారు.

ప్రతిపాదనను ఉపసంహరించుకోండి

ఖమ్మంమయూరిసెంటర్: ఒకరిద్దరి వ్యక్తిగత స్వార్థం కోసం చేసిన రోడ్డు వెడల్పు ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ డిమాండ్ చేశారు. గురువారం ఖమ్మం త్రీటౌన్ పరిధిలోని పత్తి మార్కెట్ నుంచి ప్రకాష్‌నగర్ బ్రిడ్జి వైపు వెళ్లే రోడ్డును సీపీఐ నాయకులతో కలిసి పరిశీలించారు. సీపీఐ నగర కార్యదర్శి ఎస్‌కె. జానిమియా, కార్పొరేటర్ బిజి క్లైమెంట్, జిల్లా కార్యవర్గ సభ్యులు మహ్మద్ సలాం , పగడాల మల్లేష్, సత్యనారాయణ, భూక్యా రవీందర్, నామ కుమార్, సురేష్, వి.లింగయ్య, వెంకన్న, వీరన్న, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలి

నేలకొండపల్లి: మండలంలోని మోటాపురం సొసైటీ మాజీ డైరెక్టర్ కృష్ణారావుపై పార్టీ క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని తీర్మానించినట్లు కాంగ్రెస్ గ్రామ నాయకులు గుడిమళ్ల మధు అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన మాట్లాడుతూ.. పార్టీ నుంచి గతంలో సస్పెండ్ చేసినా పార్టీ పేరుతో గ్రామంలో కొంతమందితో కలిసి గ్రామసభలో గొడవ సృష్టించారని ఆరోపించారు. కావునా పార్టీకి వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నందున అధిష్టానంను క్రమ శిక్షణ చర్యలు తీసుకోవాలని తీర్మానించినట్లు తెలిపారు.

వైఎంసీఏ ఆధ్వర్యంలో వాలీబాల్ పోటీలు



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

ఖమ్మంగాంధీచౌక్: యంగ్‌మెన్స్ క్రిస్టియన్ అసోసియేషన్ (వైఎంసీఏ) యూత్ ఫెస్టివల్‌లో భాగంగా గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 25, 26 తేదీల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లా స్థాయి ఇన్విటేషన్ వాలీబాల్ పోటీలను నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు, కార్పొరేటర్ బీజీ క్లైమెంట్ తెలిపారు. గురువారం నగరంలోని తుమ్మలగడ్డలో నిర్వహించిన సమావేశంలో టోర్నమెంట్ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. నగరంలోని మమతారోడ్డులో ఉన్న హార్వెస్ట్ స్కూల్ క్రీడా ప్రాంగణంలోటోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జెడ్‌టి సుధాకర్, కోశాధికారి పీఏజే శేఖర్, సంయుక్త కార్యదర్శి గౌతమి శిల్ప, ఆర్గనేజింగ్ సెక్రటరీ జేపీ సత్యానందం, ప్రతినిధులు జోర్డాన్, రాజశేఖర్, జోసెఫ్, రామారావు, వాలీబాల్ రిఫరీ ములుమూరి లక్ష్మారావు ఉన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఆర్టీఓ

ఖమ్మంఅర్బన్: వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తే రోడ్డు ప్రమాదాలను అరికట్టవచ్చని ఖమ్మం ఆర్టీఓ (జిల్లా రోడ్డు రవాణా శాఖాధికారి) వెంకటరమణ అన్నారు. రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా గురువారం నగరంలోని బ్లూమింగ్ మైండ్ స్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎక్కువ శాతం ప్రమాదాలు అధిక వేగం వల్ల జరుగుతున్నాయని, నిబంధనలు పాటించి ఇతరులకు ఇబ్బంది కలగకుండా వాహనాలు నడపాలని సూచించారు. ట్రాఫిక్ రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ సాంబశివరావు మాట్లాడుతూ... హెల్మెట్ ధరించాలని, సీటుబెల్ట్ పెట్టుకోవాలని, మద్యం తాగి, ఫోన్లో మాట్లాడుతూ వాహనాలు నడపొద్దన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి ఈ సదస్సులో అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్లు ఆర్.స్వర్ణలత, వి.గోపికృష్ణ, సుమలత, కరస్పాండెంట్ పి.అశోక్‌రెడ్డి, ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్, కానిస్టేబుల్స్ రమేష్, సరిత ఉన్నారు.

గణతంత్ర వేడుకలకు విద్యార్థినులు

ఖమ్మంరూరల్: హైదరాబాద్‌లో నిర్వహించబోయే గణతంత్ర వేడుకల్లో కవాతులో పాల్గొనడానికి మండలంలోని గొల్లగూడెంలోని ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాల భారత స్కౌట్స్‌అండ్ గైడ్స్ నుంచి విద్యార్థినులు పాల్గొననున్నారని హెచ్‌ఎం వి.ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

కొనసాగుతున్న ఆర్టిజన్ల దీక్షలు

ఖమ్మంవ్యవసాయం: తమ ఉద్యోగాలను కన్వెర్షన్ చేయాలని డిమాండ్ చేస్తూ ఆర్టిజన్లు నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. ఈ మేరకు గురువారం దీక్షకు సంస్థ రిటైర్డ్ ఉద్యోగ సంఘాల నాయకులు మధుసూదన్‌రావు, ఇంజనీర్లు రాజారత్నం, రవి, యూఈఈయూ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.ప్రసాద్, లాలయ్య, కృష్ణమూర్తి మద్దతు తెలిపారు. శ్రీనివాసరావు, ఉపేందర్, కృష్ణారావు, సైదులు, నరేష్, రమేష్, ఉమేష్, ప్రకాష్, రవీందర్, వెంకటేశ్వరరావు ఉన్నారు.

సీఎస్సీ సేవలపై అవగాహన

రఘునాథపాలెం: మండలకేంద్రంలో గురువారం సీఎస్‌సీ సేవలపై అవగాహన కల్పించారు. సెంటర్‌లోని సీఎస్‌సీ సెంటర్ ఏదురుగా ప్రత్యేక మొబైల్ వాహన ద్వారా సీఎస్‌సీ ద్వారా అందిస్తున్న ఆధార్ కార్డులు, ఇతర ఆన్‌లైన్ సేవలు, గురించి వాటిని పొందే విధానంపై సీఎస్‌సీ నిర్వాహకుడు తమ్మిశెట్టి నరసింహారావు వివరించారు. రామకోటి, నాగరాజు, బాప్‌సింగ్, సతీష్, రాంబాబు పాల్గొన్నారు.

'అందరినీ బాధ్యులుగా చేయొద్దు'

ఖమ్మం మామిళ్లగూడెం: ఎవరో చేసిన తప్పుకు అందరినీ బాధ్యులుగా చేయొద్దని, జీవనోపాధి కోసమే భిక్షాటన చేస్తున్నామని జిల్లా ట్రాన్స్‌జెండర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు దోమల మేరీ తెలిపారు. ఈ మేరకు గురువారం ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ... ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడడం లేదని, కొందరు తమను నేరస్తులుగా ముద్ర వేసి ప్రతీ అంశానికి వేధించడం మానుకోవాలని కోరారు. సోనీ, మాధురి, రూప, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్లు ఆవిష్కరణ

ఖమ్మంమయూరిసెంటర్: డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్లను ఐద్వా రాష్ట్ర నాయకురాలు బుగ్గవీటి సరళ, బీవీకే మేనేజర్ వై.శ్రీనివాసరావు, రిటైర్డ్ లెక్చరర్ ఆవిష్కరించారు. గురువారం మంచికంటి భవన్‌లో ఏర్పాటు చేసిన క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో వారు మాట్లాడారు. డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి షేక్ బషీరుద్దీన్, ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బండి పద్మ, మెరుగు రమణ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రవీణ్ ఉన్నారు.

రాగిజావ పంపిణీ

తిరుమలాయపాలెం: మండలంలోని పిండిప్రోలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం విద్యార్థులకు రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరావు, అధ్యాపకులు వెంకటేశ్వరరావు, పద్మావతి, ఎన్ఎస్ఎస్ పీఓ నారాయణరావు ఉన్నారు.

చలో కమిషనరేట్‌ను జయప్రదం చేయండి

ఖమ్మం మామిళ్లగూడెం: మల్టీపర్పస్ హెల్త్ వర్కర్ ఫిమేల్ నోటిఫికేషన్‌కు అదనంగా పోస్టులు పెంచి నియామకాలు చేపట్టాలని సెకండ్ ఏఎన్ఎంలు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఈనెల 27న నిర్వహించనున్న చలో కమిషనరేట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోట రామాంజనేయులు కోరారు. ఈ మేరకు గురువారం కమిషనరేట్ ఎదుట ధర్నాకు సంబంధించిన వినతిపత్రాన్ని డీఎంహెచ్ఓ కార్యాలయంలో అందించారు. సెకండ్ ఏఎన్ఎం యూనియన్ జిల్లా బాధ్యులు అంబటి శైలజ, రాజేశ్వరి, తమ్మిశెట్టి ఉమా, రమాదేవి, ప్రసన్న, శైలజ ఉన్నారు.

కార్మికులు, కర్షకులపై క్రూర చట్టాలు

ఖమ్మంమయూరిసెంటర్: కేంద్ర ప్రభుత్వం కార్మికులపై, కర్షకులపై క్రూర చట్టాలను అమలు చేస్తోందని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ కార్యదర్శి వర్గ సభ్యులు మధు అన్నారు. గురువారం ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఐ.వెంకన్న అధ్యక్షతన సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ కార్యాలయంలో సదస్సు నిర్వహించారు. జర్నలిస్టు ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి రవి, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షులు ఎస్‌కె.సుభాహన్, పార్టీ జిల్లా కార్యదర్శి రాజేంద్రప్రసాద్, డివిజన్ కార్యదర్శి కొల్లా లక్ష్మీనారాయణ, డివిజన్ కార్యదర్శి బజ్జూరి వెంకటరామిరెడ్డి, ఖమ్మం టౌన్ కార్యదర్శి మోహన్‌రావు, అరుణోదయ రాష్ట్ర అధ్యక్షులు పి.నాగన్న, పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు

ప్రత్యేక పారిశుద్ధ్య పనులు

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని పలు ప్రాంతాల్లో కేఎంసీ అధికారులు గురువారం ప్రత్యేకంగా పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. గ్యాంగ్‌వర్క్ కింద ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ కళాశాల మైదానంలో వాకింగ్ ట్రాక్‌ను శుభ్రం చేశారు. జూబ్లీ క్లబ్ నుంచి ఎమ్మార్వో, కలెక్టర్ క్యాంపు కార్యాలయం వరకు ప్రత్యేక డ్రైవ్ క్రింద రోడ్లను ఊడ్చి, వ్యర్థాలను ఎత్తారు.

ట్విన్‌బిన్ల ఏర్పాటుకు చర్యలు ..

ఖమ్మం నగరంలో గార్బేజ్ పాయింట్లలో వ్యర్థాలను రోడ్ల వెంట పడవేయకుండా డబ్బాలను ఏర్పాటు చేసేందుకు కేఎంసీ అధికారులు చర్యలు చేపట్టారు. నగరంలో 194 ప్రాంతాల్లో గార్బేజ్ పాయింట్లు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఆయా ప్రాంతాల్లో రెండు చెత్తడబ్బాలను ఏర్పాటు చేయనున్నారు. వీటితో పాటు రోడ్ల వెంట చెత్త పడవేసే ప్రాంతల్లో ఫైన్ బోర్డ్స్‌ను ఏర్పాటు చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. త్వరలోనే వీటిని ఏర్పాటు చేసేందుకు టెండర్లను ఆహ్వానించనున్నట్లు తెలిసింది.

సుభాష్ చంద్రబోస్‌కు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా పోరాటం చేసిన మహావ్యక్తి నేతాజీ సుభాష్ చంద్రబోస్ అని బీజేపీ జిల్లా అధ్యక్షులు గల్లా సత్యనారాయణ కొనియాడారు. గురువారం సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్ర నాయకులు సన్నే ఉదయ ప్రతాప్, బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి, గెంటేల విద్యాసాగర్, జిల్లా ప్రధాన కార్యదర్శిలు శ్యామ్ రాథోడ్, నున్న రవికుమార్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు డాక్టర్ శీలం పాపారావు ఉన్నారు. అదేవిధంగా ఖమ్మం త్రీటౌన్ బోసుబొమ్మ సెంటర్‌లోని సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు డాక్టర్ శీలం పాపారావు పూల మాలలు వేసి నివాళులర్పించారు. వన్‌టైన్ అధ్యక్షుడు గడియల నరేష్, నాయకులు రాజేష్‌గుప్త, ప్రతాప్, రాము, పాపారావు, రమణ, శంకర్‌గౌడ్ ఉన్నారు. కమాన్ బజార్‌లో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మార్తి వీరభద్రప్రసాద్ ఆధ్వర్యంలో బోస్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. టీజీవోస్ జిల్లా మాజీ అధ్యక్షుడు కూరపాటి రంగరాజు, బూత్ అధ్యక్షుడు పసుమర్తి సంతోష్, జిల్లా ఉపాధ్యక్షురాలు మందా సరస్వతి, దారాశ్యామ్, విష్ణు, నాగేంద్ర, శ్రీనివాసరావు, మురళి, ఆనంద్, వంశీకృష్ణ, కమల్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.